మన మీ.. వార్త
ప్రతి అక్షరం... ప్రజల కోసం
TGBIL/25/A0512
ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం
25 ఆగస్టు 2026
పేజీలు : 4
@mvaartanews
www.mivaartanews.com

# సీతారామ ప్రాజెక్టు మండల రైతులు నీళ్లు ఇవ్వాలి - సిపిఎం జిల్లా కార్యదర్శి.

**కారేపల్లి ఆగస్టు 24 మీ వార్త ప్రతినిధి:**

సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగు త్రాగునీరు సింగరేణి మండల రైతులకు ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం రాత్రి సిపిఎం సీనియర్ నాయకులు, బాజు మల్లయి గూడెం మాజీ సర్పంచ్ అమరజీవి కామ్రేడ్ కరపటి రాములు గ 13వ వర్ధంతి సభ వజ్జా రామారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయమే ప్రధాన వృత్తిగా జీవిస్తున్న గిరిజన గిరిజనేతర పోడు వ్యవసాయ పేదలకు వర్షపు నీరు ఆ నీటితో నిండే చెరువులు, కుంటలు, బోర్లు, బావులు మినహా శాశ్వతమైన నీటి వనరులు లేని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి మండలం పట్ల నిర్లక్ష్య వైఖరిని ఆవలంబిస్తున్నాయని విమర్శించారు. సింగరేణి మండలానికి సంబంధించిన మధ్యతరగతి పేద రైతుల భూములను సీతారామ ప్రాజెక్టు కాలువలకు ఇస్తున్నప్పటికీ 2013 భూ నిర్వాసితులు చట్టాన్ని




అమలుపరిచే పద్ధతిలో లేవని ఆ కాలువ ద్వారా చుక్క నీరు కూడా సింగరేణి మండల భూములకు రావని అన్నారు. గుట్టని దాటించకుండా ఈ కాలవుల గుండా నీరు ఎలా వెళ్తుందో ఎక్కడికి వెళ్తుందో ఈ ప్రాంత భూములకు నీళ్లు ఇవ్వకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న విద్యా వైద్య సౌకర్యాలతో పాటు భూ సంబంధిత సమస్యలపై మరియు కరపటి రాములు ప్రజా ప్రతినిధిగా కమ్యూనిస్టుగా అనేక సౌకర్యాలు పోరాటాల కల్పనలో ముందుండి ప్రజల మనసు గెలుచుకున్న నాయకుడని కొనియాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యపరచి ప్రజా సమస్యలపై పోరాడటమే కరపటి రాములుకి ఇచ్చే నిజమైన నివాళి అని కామ్రేడ్ నున్న నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ కార్యదర్శి భూక్య వీరభద్రం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మెరుగు సత్యనారాయణ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు దుగ్గి కృష్ణ,కొండబోయిన నాగేశ్వరరావు, పార్టీ మండల కార్యదర్శి కే నరేంద్ర, ప్రజానాట్యమండలి నాయకులు కరకపల్లి రాయమల్లు,మండల కమిటీ సభ్యులు సురభాగ దనమ్మ యనమనగండ్ల రవి బాబు, శాఖ కార్యదర్శి సూరబాక సర్వయ్య, సోషల్ మీడియా కన్వీనర్ ధరావత్ వినోద్ కుమార్, పార్టీ సభ్యులు షేర్ వెంకటేశ్వర్లు, బచ్చల బుజ్జమ్మ, బచ్చల వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ కరపటి రంబాయమ్మ, భారత లక్ష్మి, బజ్జల వంశీకృష్ణ, ధరావత్ సరిత, కరపటి రాములు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అశ్వారావుపేటలో ఘనంగా వంగవీటి మోహనరంగా విగ్రహ ఆవిష్కరణ.






**అశ్వారావుపేట ఆగస్టు 24 మీ వార్త ఆర్ సి వనమాల శ్రీనివాసరావు:** సామాజిక న్యాయం సమానత్వం ఐకమత్యమే సమాజ అభివృద్ధికి బాటలు వేస్తుంది ఎమ్మెల్యే జారె. అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రంలో మండల కాపు సామాజిక వర్గాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రముఖ ప్రజానాయకుడు వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో అన్ని సామాజిక వర్గాల మధ్య ఐకమత్యం సోదరభావం పరస్పర గౌరవం సామాజిక న్యాయం సమానత్వం వంటి అంశాలపై ఎమ్మెల్యే జారె ఆదినారాయణ విస్తృతంగా ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి వంగవీటి మోహనరంగా కుమారుడు వంగవీటి రాధాకృష్ణ ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పసుపులేటి వీరబాబు, యడవల్లి కృష్ణ, కరాటం రాంబాబు విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజాప్రతినిధులు కాపు సామాజిక వర్గాల నాయకులు యువత రంగా అభిమానులు వివిధ సామాజిక వర్గాల ప్రతినిధులు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ.. వంగవీటి మోహనరంగా ప్రజల కోసం నిలబడిన నాయకుడిగా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. పేదలు బడుగు బలహీన వర్గాలు సామాన్య ప్రజల సమస్యలపై ఆయన పోరాటం చేశారని ప్రజల పట్ల ఆయనకు ఉన్న నిబద్ధతను నేటి తరం గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో ప్రతి కులానికి ప్రతి వర్గానికి సముచిత గౌరవం సమాన అవకాశాలు లభించడమే నిజమైన సామాజిక న్యాయమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కులాలు మతాలు ప్రాంతాలు వేరైనా మనమంతా ఒకే సమాజంలో జీవిస్తున్న సోదరులమని పరస్పరం గౌరవించుకుంటూ ముందుకు సాగినప్పుడే నియోజకవర్గం రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఎవరినీ తక్కువగా చూడకుండా ఏ సామాజిక వర్గాన్నీ విస్మరించకుండా ప్రతి ఒక్కరినీ సమానంగా గౌరవించుకోవాలని పిలుపునిచ్చారు.

అణగారిన వర్గాలకు అండగా నిలవడం పేదల సంక్షేమం కోసం పనిచేయడం వెనుకబడిన వర్గాలకు అవకాశాలు కల్పించడం ప్రజాప్రతినిధుల బాధ్యత మాత్రమే కాకుండా సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. బీసీల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది.

బీసీలకు రాజకీయ సామాజిక విద్యా ఉద్యోగ రంగాల్లో మరిన్ని అవకాశాలు కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఎమ్మెల్యే జారె ఆదినారాయణ వివరించారు. బీసీలకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం రిజర్వేషన్ల సాధనతో పాటు సామాజికంగా ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నామని తెలిపారు. బీసీల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతున్న విషయాన్ని కూడా ఎమ్మెల్యే వివరించారు. బీసీ వర్గాలకు చెందిన యువతకు విద్య, ఉద్యోగ, స్వయం ఉపాధి అవకాశాలు మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలోని వెనుకబడిన వర్గాలకు అభివృద్ధి ఫలాలు సమానంగా అందినప్పుడే నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కాపు సామాజిక వర్గం మాత్రమే కాకుండా అన్ని సామాజిక వర్గాల ప్రజలు ఐక్యంగా ముందుకు సాగాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఒకరి విజయాన్ని మరొకరు అభినందిస్తూ ఒకరి కష్టాల్లో మరొకరు అండగా నిలవాలని అన్నారు. కులాల మధ్య చిచ్చు పెట్టే విధానాలకు దూరంగా ఉండి అన్ని వర్గాల మధ్య సోదరభావాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

అశ్వారావుపేట నియోజకవర్గం భిన్న సామాజిక వర్గాలు భిన్న సంస్కృతులు సంప్రదాయాలతో కూడిన ప్రాంతమని ఇక్కడి ప్రజల మధ్య ఉన్న ఐక్యత, ఆత్మీయత నియోజకవర్గానికి ప్రత్యేక గుర్తింపును తీసుకొస్తుందని అన్నారు. మనమంతా ఒక్కటే మన నియోజకవర్గ అభివృద్ధే మనందరి లక్ష్యం అనే భావనతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రజల మధ్య విభేదాలు సృష్టించడం ద్వారా ఎవరికీ ప్రయోజనం ఉండదని ఐకమత్యంతో సమస్యలను పరిష్కరించుకుంటూ అభివృద్ధి వైపు అడుగులు వేయాలని సూచించారు. అన్ని కులాలు, అన్ని వర్గాల ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ ప్రతి ఒక్కరి హక్కులను గౌరవిస్తూ ముందుకు వెళ్లడమే తన లక్ష్యమని తెలిపారు. వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని అశ్వారావుపేటలో ఏర్పాటు చేయడం ద్వారా ఆయన సేవలను పోరాట స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు పరిచయం చేసే అవకాశం ఏర్పడిందని ఎమ్మెల్యే అన్నారు. రంగా ఆశయాలను స్మరించుకోవడంతో పాటు పేదలు సామాన్యులు బలహీన వర్గాల కోసం పనిచేయాలనే స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సూచించారు.


ఈ కార్యక్రమం సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలిచిందని అన్ని వర్గాల ప్రజలు పరస్పర గౌరవంతో సోదరభావంతో కలిసి పనిచేస్తే అశ్వారావుపేట నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లవచ్చని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పేర్కొన్నారు...

## హాస్టల్ విద్యార్థులకు క్రీడా సామాగ్రిని పంపిణీ చేసిన సర్పంచ్, ఉప సర్పంచ్లు.

**మణుగూరు ఆగస్టు 24 మీ వార్త ప్రతినిధి:**

మణుగూరు మండల కేంద్రంలోని మణుగూరు షెడ్యూల్ కులాల (ఎస్సి) అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ బాలుర వసతి గృహంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్న బ్యాగ్స్, షూస్, బెడ్ షీట్స్, క్రీడా సామాగ్రిని పంపిణీ చేసిన సమితి సింగారం గ్రామపంచాయతీ సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్, 4వ వార్డు సభ్యులు ఉకే కృష్ణవేణి, 5వ వార్డు సభ్యులు కోలపిన్ని మానస, ఈ సందర్భంగా వారు మాట్లాడుతు.. విద్యార్థులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని విద్యలో తమ ప్రతిభను కనబరిచి ఉత్తమ శ్రేణి మార్కులతో పాస్ కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ .రేవంత్ రెడ్డి కి, పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు కి ధన్యవాదాలు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ కేసుపాక. నరేష్ కుమార్, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.






## సత్తుపల్లి సింగరేణి కాలనీలో ఘనంగాలి పోచమ్మ బోనాలు.





**సత్తుపల్లి ఆగస్టు 24 మీ వార్త టౌన్ రిపోర్టర్:**

సత్తుపల్లి సింగరేణి కాలనీలో నెలకొన్న పోచమ్మ తల్లి ఆలయం అమ్మవారికి బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు సాంప్రదాయ బద్ధంగా బోనాలు సమర్పించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మంగళ వాయిద్యాలతో మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి, పోతురాజు కు నైవేద్యాలు సమర్పించారు. శివసత్తుల పూనకాలు పోతురాజుల విన్యాసాలు ఈ ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పోచమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకున్నారు. కాలనీ అంతా పండుగ వాతావరణం నెలకొనగా పోచమ్మ తల్లి అమ్మవారికి బోనాల సమర్పించి అమ్మవారి ఆశీస్సులతో కాలనీ కుటుంబ సభ్యులకు అష్ట ఐశ్వర్యాలు, ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో సంతోషంగా ఉండాలని వేడుకున్నారు. కాలనీలో పోచమ్మ తల్లి బోనాల పండుగను విజయవంతం చేసిన కాలనీ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులకు పోచమ్మ తల్లి ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## విశ్వవిద్యాలయాన్ని మరిపిస్తున్న భద్రాచలం జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాల.

- మండల విద్యాశాఖ అధికారి బెక్కంటి శ్రీనివాసరావు.



**భద్రాచలం ఆగస్టు 24 మీ వార్త ప్రతినిధి:**

భద్రాచలం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలోని వసతులు గాని విద్యార్థులు క్రమశిక్షణ తరగతులను నిర్వహణ గాని ఉపాధ్యాయుల బోధన గాని కంప్యూటర్, గణితము, సైన్స్ ల్యాబ్ నిర్వహణ మరుగుదొడ్ల నిర్వహణ గాని విశ్వవిద్యాలయాన్ని మైమరిపిస్తుందని మండల విద్యాశాఖ అధికారి బెక్కంటి శ్రీనివాసరావు అభిప్రాయం వ్యక్తం చేశారు. సోమవారం ప్రార్ధన సమయంలో పాల్గొని కొద్దిసేపు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఉదయం ప్రార్థన కన్నా ముందే విద్యార్థులు పాఠశాలలకు హాజరై పాఠశాలలోని నిన్న ఉపాధ్యాయులు ఇచ్చిన ఇంటి పనిని పూర్తి చేయటం గమనార్హం. ఈ నేపథ్యంలో అన్ని తరగతి గదులు వసతులను స్వయంగా ఆయన పరిశీలించిన అనంతరం ఉపాధ్యాయులతోనూ విద్యార్థులతోనూ మాట్లాడి ప్రత్యేకమైనటువంటి అభినందనలు తెలియజేశారు. పాఠశాలలో హరితహారం, పరిశుభ్రత పచ్చదనం చూడముచ్చటగా ఉందని స్వయంగా విద్యార్థి కేంద్రంగా తరగతి గది బోధనా తో పాటు కిచెన్ గార్డెన్ నిర్వహణ నిర్వహించడం ప్రధాన ఉపాధ్యాయిని కృషికి నిదర్శనమని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. సుమారు 475 మంది పిల్లలు ఉన్నప్పటికీ నిశ్శబ్ద వాతావరణంలో పాఠశాల ఉండటం ఉదయం పిల్లలు ప్రార్థన కన్నా ముందే వచ్చి వారి వారి తరగతి గదిలో వారి ఇంటి పనిని పూర్తి చేసుకోవటం, క్రమశిక్షణతో ఉండటం, నిశ్శబ్దత పాటించటం చూపరాలను సైతం ఆకట్టుకుంటుంది. ఇక్కడ పనిచేసే సిబ్బంది ఉపాధ్యాయులు అంకితభావం వారి సమిష్టి కృషికి నిదర్శనమని, ఈ పాఠశాల పనితీరు లో ప్రతి ఉపాధ్యాయుడు నిరంతర కృషిని ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని గుర్తించాలని పిలుపునిచ్చారు..

## పినపాకలో ప్రజావాణికి 12 దరఖాస్తులు.

**పినపాక ఆగస్టు 24 మన మీ వార్త:**




పినపాక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో వెంకటేశ్వరరావుతో పాటు వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. ప్రజల నుంచి 12 దరఖాస్తులు స్వీకరించి, ఆన్‌లైన్‌లో నమోదు చేసి రసీదులు అందజేశారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో ఏఓ వెంకటేశ్వర్లు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ప్రవీణ్ కుమార్, వెటర్నరీ డాక్టర్ ఉజ్వల, హాస్టల్ వార్డెన్లు ప్రదీప్ రెడ్డి, సతీష్, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.

## సారంపల్లి మల్లారెడ్డి మృతికి పినపాక సిపిఎం నేతలు నివాళులు.

**పినపాక ఆగస్టు 24 మన మీ వార్త:**



సీపీఎం సీనియర్ నాయకులు, రైతు సంఘం అఖిల భారత నాయకులు కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి మృతికి పినపాక మండలంలో సీపీఎం నాయకులు నివాళు లర్పించారు. ఆయన మృతి పట్ల సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు నిమ్మల వెంకన్న, మండల కార్యదర్శి దుబ్బ గోవర్ధన్, మడివి రమేష్‌తో పాటు మండల కమిటీ సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు. మల్లారెడ్డి సేవలను వారు స్మరించుకున్నారు.

## షాదీ ఖానా కమిటీ చైర్మన్గా మహమ్మద్ యాకూబ్ అలీ.



**కారేపల్లి ఆగస్టు 24 మీ వార్త ప్రతినిధి:** సింగరేణి మండల కేంద్రంలో గలకారేపల్లి షాదీఖానా నూతన కమిటీని నియమిస్తూ ఖమ్మం జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. షాదీఖానా కమిటీ చైర్మన్ గా మహమ్మద్ యాకుబ్ అలీ, వైస్ చైర్మన్ గా షేక్ మజీద్ పాషా, కార్యదర్శిగా ఎండి సల్మా, సభ్యులుగా షేక్ యాకుబ్ పాషా, షేక్ ఖదీర్ నియామకమయ్యారు. అందుకు సంబంధించిన నియామక ప్రతులను తాసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు, ఎంపీడీవో బి.పద్మ కు నూతన కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సర్పంచ్ మేదరి వీర ప్రతాప్ టోనీ ఇతర నాయకులు కలిసి అందజేశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు ప్రజా ప్రతినిధులు గ్రామ సర్పంచులు సీనియర్ కాంగ్రెస్ నేతలు శుభాకాంక్షలు తెలిపారు.

## తీజ్ నిమర్జన కార్యక్రమం.

- తీజ్ పండగ కు విశిష్ట స్థానం.
- అప్పాయి గూడెం సర్పంచ్ దండు ప్రవీణ్.





**కారేపల్లి ఆగస్టు 24 మీ వార్త ప్రతినిధి:**

బంజారా సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పండుగ తీజ్ అని అప్పాయి గూడెం గ్రామ సర్పంచ్ దండు ప్రవీణ్ అన్నారు అన్నారు. తీజ్ పండుగ సందర్భంగా గ్రామంలో డీజే లను ఏర్పాటు చేసి బంజారా సంస్కృతి సంప్రదాయాలకు అనుగుణంగా తొమ్మిది రోజులుగా యువతులు భక్తిశ్రద్ధలతో తీజ్ పూజలు నిర్వహించి, సోమవారం నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా దేవతలకు నైవేద్యాలు సమర్పించి, బంజారా సంప్రదాయ నృత్యాలతో సందడి చేశారు. ప్రకృతిని, పంటలను, పశుసంపదను గౌరవించే బంజారా సమాజంలో తీజ్ పండుగకు విశిష్ట స్థానం ఉందని సర్పంచ్ తెలిపారు. తీజ్ పండుగ ప్రజలందరినీ ఒక్కచోట చేర్చి ఐక్యతను చాటుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ వర్కర్లు భారీగా తరలి రండి.

- కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయండి.
- సిఐటియు మండల కార్యదర్శి బాదావత్ శ్రీను, నరాటి నాగేశ్వరరావు.




కామేపల్లి ఆగస్టు 24 మీ వార్త ప్రతినిధి: ప్రభుత్వం గ్రామ పంచాయతీ వర్కర్ల న్యాయమైన సమస్యలను సత్వరమే పరిష్కరించి ఆదుకోవాలని కోరుతూ మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించనున్న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు మండల కన్వీనర్ బాదావత్ శ్రీను కోరారు. ఈ మేరకు సోమవా రం ఎంపీడీవో ధరావత్ సోం లాల్, ఎం పి ఓ వివిఎస్ శాస్త్రికి లిఖితపూర్వకంగా గ్రామ పంచాయతీ వర్కర్లు విన్నవించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కలెక్టర్ ముట్టడి కార్యక్రమానికి గ్రామపంచాయతీ వర్కర్లు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్ల యూనియన్ మండల కార్యదర్శి నరాటి నాగేశ్వరరావు, ఉపేందర్, వీరభద్రం తదితరులు.

## అదృశ్యమైన యువతి ఆచూకీ లభ్యం తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు.

- వంచించిన యువకుడి పై కేసు.
- టెక్నాలజీతో కేసును చేదించిన కారేపల్లి పోలీసులు.

**కారేపల్లి ఆగస్టు 24 మీ వార్త ప్రతినిధి:** మూడు నెలల క్రితం నమోదైన మిస్సింగ్ కేసులో కారేపల్లి పోలీసులు టెక్నాలజీని ఉపయోగించి ఎట్టకేలకు యువతిని గుర్తించి సోమవారం తల్లిదండ్రులకు అప్పగించారు. పెళ్లి చేసుకుంటానని యువతిని మోసం చేసిన హైదరాబాదుకు చెందిన రుకుమ్ అనే యువకుడి పై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు. కారేపల్లి ఎస్ఐ గోపి తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని బళ్లునగర్ తండాకు చెందిన ఓ యువతి అదృశ్యం పై గత మే నెలలో యువతి తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. యువతి ఫోన్ లేకుండా వెళ్లడంతో ట్రేస్ చేయడం ఇబ్బందిగా మారింది. ఈ నేపథ్యంలో కారేపల్లి ఎస్ఐ గోపి టెక్నాలజీని ఉపయోగించి యువతి ఆచూకీని గుర్తించారు. యువతిని పెళ్లి పేరుతో మోసం చేసిన యువకుడిని అదుపులోకి తీసుకుని, యువతిని తల్లిదండ్రులకు అప్పగించారు.

## పాప హరీశ్వరునికి ప్రత్యేక పూజలు



**బాసర :** బాసర ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ పాపహరేశ్వర ఆలయంలో ఆదివారం శ్రావణమాసం ఏకాదశి సందర్భంగా స్వామివారికి అర్చకులు నాగేష్ అప్ప ఆధ్వర్యంలో రుద్రాభిషేకం,అన్నపూజ, హర్చన,హారతి విశేష పూజలు ఘనంగా నిర్వహించారు. భక్తులందరికీ అన్న దానం నిర్వహించారు సోమ వారం రోజు శ్రీ పాప హరేశ్వర నూతన ఆలయ కమిటీ కార్యవ ర్గాన్ని ఎన్నుకుంటామని సర్పంచ్ తీగల వెంకటేష్ గౌడ్,విడిసి అధ్యక్షుడు లింగారావు ఒక ప్రకటనలో తెలిపారు.

# సీతారామ ప్రాజెక్టు భూ నిర్వాసితులకు ఎకరాకు రూ.25 లక్షల పరిహారం అందించాలి

- 2019 భూ సేకరణ అవార్డు రద్దు చేయాలి.
- ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం పరిహారం అందించాలి.
- కలెక్టరేట్ ఎదుట సీతారామ ప్రాజెక్టు భూ నిర్వాసిత రైతులు ధర్నా, వినతి.
- సానుకూలంగా స్పందించిన కలెక్టర్.




**కామేపల్లి ఆగస్టు 24 మీ వార్త ప్రతినిధి:**

సీతారామ ప్రాజెక్టు నిర్మాణం లో భాగంగా కామేపల్లి మండలం లో భూ సేకరణ పరిహారం అవార్డు 2019 లో ఎకరాకు రూ.10.5 లక్షల ప్రభుత్వం ప్రకటించి నేటికి రైతులకు అందించలే దు.రైతు బంధు, రైతు భరోసా నిధులు కుడా రైతులకు ఇవ్వకుండా ప్రభుత్వం నిలుపుదల చేసింది. ప్రస్తుతం రైతులు భూమి ప్రభుత్వం గత అవార్డు ప్రకారం ఎకరాకు పది లక్షల ఏభై వేల రూపాయలు పరిహారం ఇచ్చి భూమి స్వాధీనం చేసుకోవడం కోసం ప్రయత్నాలు చేస్తుంది. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం పరిహారం ఎకరాకు ఇరవై ఐదు లక్షల రూపాయల అందించాలి అని రైతులు సోమవారం ఖమ్మం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ దివాకర్ టీఎస్,అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి కి వినిత పత్రం అందజేశారు.దీంతో స్పందిం చిన కలెక్టర్, అదనపు కలెక్టర్ భూ నిర్వాసితులకు చట్టబదమైన పరిహారం అందించే విధంగా కృషి చేస్తామని, భూముల్లో ఉన్న బోర్లు, బావులు, చెట్లు రి సర్వే చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు భూ నిర్వాసితుల సంఘం నాయకులు దుగ్గి కృష్ణ, వజ్జా రామారావు, ప్రతాప నేని వెంకటేశ్వరరావు, నిర్వాసిత రైతులు సింగం వెంకన్న, రమేష్, నామ రాం రెడ్డి, నల్లమోతు శ్రీనివాసరా వు,హరిజ్య,వెంకటనర్సమ్మ, పోలెబోయిన లక్ష్మి తోపాటు నిర్వాసిత రైతులు పెద్ద సం ఖ్యలో పాల్గొన్నారు.

# శానిటేషన్ మెరుగుపరిచి సీజనల్ వ్యాధులను అరికట్టాలి.

- చంద్రాలగూడెం గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్.





**కొత్తగూడెం ఆగస్ట్ 24 మన మీ వార్త:**

జిల్లాలో వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పారిశుద్ధ్య పరిస్థితులను మెరుగుపరచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ సూచించారు.పాల్వంచ మండలము ఊళ్ళోనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల చంద్రాలగూడెం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న ప్రజలను డీఎంహెచ్ఓ పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో అవసరమైన వారికి వైద్య సేవలు అందించేందుకు వైద్య శిబిరం ఏర్పాటు చేసి, రోగులను పరీక్షించి, వారితో మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ గ్రామాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడటం, దోమల గుడ్లు లార్వాలు పెరగకుండా నివారణ చర్యలు చేపట్టడం అత్యంత ముఖ్యమన్నారు. ఇంటి పరిసరాల్లోని పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, పూల కుండీలు, ప్లాస్టిక్ డబ్బాలు, ఇతర నీరు నిలిచే వస్తువులను తొలగించాలని సూచించారు.మురికి కాలువల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, ఓవర్‌హెడ్ ట్యాంకులు, నీటి తొట్టెలు, డ్రమ్ములు తదితర నీటి నిల్వ ప్రదేశాలను మూతలతో భద్రపరచాలని తెలిపారు. వారానికి ఒకరోజు డ్రై డే పాటిస్తూ ఇంటి లోపల, బయట నీరు నిలిచే ప్రదేశాలను గుర్తించి తొలగించాలని సూచించారు.దోమల వృద్ధి అధికమైతే మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, ఫైలేరియా (బోదకాలు) వంటి వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. వర్షాకాలంలో వైరల్ జ్వరాలు, టైఫాయిడ్, అతిసారం, జాండిస్, శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు వంటి సీజనల్ వ్యాధులు కూడా వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.జ్వరం, చలి, వణుకు, తీవ్రమైన తలనొప్పి, కీళ్ల నొప్పులు, శరీరంపై దద్దుర్లు, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు కనిపిస్తే స్వయంగా మందులు వాడకుండా సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రి లేదా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. జ్వరంతో బాధపడుతున్న వారికి అవసరమైన రక్త పరీక్షలు నిర్వహించి వ్యాధిని నిర్ధారించుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రేగళ్ల ఆకస్మిక తనిఖీ అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రేగలను డీఎంహెచ్ఓ డాక్టర్ తుకారాం రాథోడ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించి, సిబ్బంది సమయపాలనతో విధులకు హాజరు కావాలని సూచించారు.అనంతరం ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, రోగులకు అందుతున్న చికిత్స, మందుల లభ్యత, సీజనల్ వ్యాధుల నియంత్రణ చర్యలు తదితర అంశాలను పరిశీలించారు. ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలు సమర్థవంతంగా అందేలా సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో శానిటేషన్, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, సురక్షిత తాగునీరు, దోమల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని వైద్య సిబ్బందికి సూచించారు. జ్వర కేసులను నిర్లక్ష్యం చేయకుండా అవసరమైన పరీక్షలు నిర్వహించి, వ్యాధులపై నిఘా కొనసాగించాలని ఆదేశించారు.

పరిశుభ్రమైన గ్రామం -- ఆరోగ్యకరమైన గ్రామం అనే లక్ష్యంతో ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులు, పంచాయతీ సిబ్బంది వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సమన్వయంతో పనిచేస్తే సీజనల్ వ్యాధులను సమర్థవంతంగా అరికట్టవచ్చని డీఎంహెచ్ఓ డాక్టర్ తుకారాం రాథోడ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రతాప్ జిల్లా ఉపవైద్య ఆరోగ్య శాఖ అధికారి, డాక్టర్ దేవేందర్ వైద్యాధికారి, దేవా, భీమ్సింగ్ , లక్ష్మీ, రాంరెడ్డి, గ్రామ సర్పంచులు, కార్యదర్శి పాల్గొన్నారు.

# వరి పంట వేసిన రైతులు బోనస్ కోసం ఈ నెల 30 లోగా ఆన్లైన్ చేసుకోవాలి.

- కామేపల్లి ఏ వో బి. తారా దేవి.



**కామేపల్లి ఆగస్టు 24 మీ వార్త ప్రతినిధి:** కామేపల్లి మండలంలో వరి పంట వేసిన రైతులు బోనస్ కోసం ఆన్లైన్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బి.తారా దేవి సోమవారం కోరారు. రైతులు ప్రభుత్వం చెప్పిన వరి రకాలు 1. బిపిటి 5204 2. ఆర్ఎన్ఆర్ 15048 3.హెచ్ఎంటి సోనా 4.వరంగల్ 44(సిద్ది ) 5.కేఎన్ఎమ్ 1638 6.కేఎన్ఎమ్ 7715, 7. జై శ్రీరామ్ రకాలు రైతులుఎవరి విత్తన దుకాణంలో కొనుగోలు చేశారో ఆ విత్తన షాప్ దగ్గరకు వెళ్లి మీరు కొన్న రసీదు చూపి వారితో ఆన్లైన్ చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఆన్లైన్ చేసుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వం ఇచ్చే బోనస్ వర్తిస్తుందని తెలిపారు. కొందరు రైతులు వారి సొంత వడ్లు నే వేసుకొనే వారు ఇతర రైతుల వద్ద కొనుగోలు చేసిన వారు బయట జిల్లాలో కొనుకున్న వారు కె.వి.కె ల వద్ద కొనుకున్న వారు విత్తన షాప్ లవద్ద కాకుండా మరి ఇంకా ఎక్కడ ఎక్కడైనా కొనుగోలు చేసిన రైతులు బిల్ లేకుండా ఉంటే 7 రకాలు వేసిన వారు మాత్రమే సెల్ఫ్ డిక్లరేషన్ 100 రూపాయల బాండ్ పేపర్ మీద రాసి, రైతుల పాసుబుక్, ఆధార్ కార్డు జత పరిచి ఆయా ప్రాంతాల ఏ ఈ ఓ లకు ఇవ్వాలని వారు ఆన్లైన్ చేస్తారని తెలిపారు.కామేపల్లి మండలం లో 7 రకాలు పంట వేసిన రైతులు ఈ నెల 30 తారీకు వరకు గడువు ఉందని వెల్లడిం చారు.ఆన్లైన్ చేసుకొని ప్రభుత్వం అందించే బోనస్ ను పొందాలని ఆమె రైతులకు విజ్ఞప్తి చేశారు.

# ప్రజావాణి లో వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరిస్తాం.

- ఎంపీడీవో ధరావత్ సోంలాల్, ఎం పి ఓ వివిఎస్ శాస్త్రి.





**కామేపల్లి ఆగస్టు 24 మీ వార్త ప్రతినిధి:** ప్రజావాణిలో ప్రజలు చేసే ఫిర్యాదులను సాధ్య మైనంత వరకు సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేయడం జరుగుతుందని ఎంపీడీవో ధరావత్ సోంలాల్, తాసిల్దార్ కె వి శ్రీనివాసరా వు,ఎం పి ఓ వివిఎస్ శాస్త్రి అన్నారు.కామేపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన రెండవ వారం ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించిన అనంతరం వారు మాట్లాడారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు ప్రజావాణి కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుంది అన్నారు. ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరగనున్న ప్రజావాణి కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఏవో బి.తారా దేవి, ట్రాన్స్ కో ఏఈ ఎన్.శ్రీనివాసులు, మండల పశు వైద్యాధికారి డాక్టర్ జి.నాగులు, మిషన్ భగీరథ గ్రిడ్ ఏఈ ధరావత్ బాలాజీ, మిషన్ భగీరథ ఇంట్రా వర్క్ ఇన్స్పెక్టర్ అంజం రాజు, ఏపీఎం ఎం. వెంకటరామారావు, ఏపీవో అద్దంకి శ్రీరాణి, డాక్టర్ శ్రీదేవి, పి ఆర్ ఏ ఈ వి. కేశవరావు, గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రఘునాథ్, ఐసిడిఎస్ సూపర్వైజర్ పారుపల్లి లక్ష్మి, మండల పరిషత్ సూపరిండెంట్ తన్నీరు నరేందర్, సీనియర్ అసిస్టెంట్ పాపారావు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు అండగా టీజేఎఫ్.




**ఖమ్మం ఆగస్టు 24 మీ వార్త ప్రతినిధి:**

ఖమ్మం ప్రెస్ క్లబ్ లో టి యూడబ్ల్యూజే టీజేఎఫ్ ఖమ్మం ప్రెస్ క్లబ్ కమిటీ సమావేశం గుద్దేటి రమేష్ బాబు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించడం జరిగింది. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కారం దిశగా ఉద్యమ కార్యాచరణ రూపొందించు కోవాలని ప్రధానంగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్న వారికి అండగా ఉండాలని, ఇళ్ల స్థలాల అంశంలో రాజీలేని పోరాటం చేయడంలో టీజేఎఫ్ ప్రెస్ క్లబ్ కమిటీ ఎప్పుడు ముందుంటుందని, గతంలో వివిధ రూపాలలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని, కలిసి వచ్చే వారితో ఉద్యమ పోరాటం చేయటంలో ముందుంటుందని, అక్రిడేషన్ కార్డులు పూర్తిస్థాయిలో అర్హులకు అందివ్వాలని, యూనియన్ మరింత బలోపేతం చేయడంలో ఐక్యంగా కలిసి పనిచేయాలని తీర్మానించడం జరిగింది. ఈ సమావేశంలో ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు, కోశాధికారి బిక్కీ గోపి , నగర కార్యదర్శి అమరవరపు కోటేశ్వరరావు, జిల్లా యూనియన్ ఉపాధ్యక్షులు మందుల ఉపేందర్, మీడియా ఇంచార్జ్ తిరుపతిరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్వీ రెడ్డి, ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు రేపాక యాదగిరి, పులి శ్రీను,మూల జీవన్ రెడ్డి, సహాయ కార్యదర్శిలు ఉల్లోజు రమేష్, నాయకులు రోసి రెడ్డి, ఇసంపల్లి వెంకటేశ్వర్లు, అప్పారావు, కూరపాటి నరేష్, రేపల్లె నాగ శేఖర్,మురళి, లింగయ్య, పెంటి వెంకటేశ్వర్లు, రామకృష్ణ, శివరామకృష్ణ, మాధవి, కిరణ్మయి, పాషా, రవి, సాంబ, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులు అరెస్ట్- 19 కేజీల గంజాయి స్వాధీనం.

**- గంజాయి అక్రమ రవాణాపై కఠిన చర్యలు తప్పవు -- భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్.**

**భద్రాచలం ఆగస్టు 24 మన మీ వార్త:** భద్రాచలం డీఎస్పీ ఆదేశాల మేరకు భద్రాచలం పట్టణ ఎస్సై వి. సతీష్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది 23.08.2026 రాత్రి భద్రాచలం ఆర్టీసీ బస్టాండ్ పరిసరాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, పోలీసులను చూసి అనుమానాస్పదంగా పారిపోవడానికి ప్రయత్నించిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో వారు ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అజయ్ అజయ్ సైని, ఉజ్వల్ ఉజ్వల్ సైనిగా గుర్తించారు. సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో గంజాయి రవాణాకు పాల్పడుతున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. మహమ్మద్ అష్రఫ్ ఖురేషి అనే వ్యక్తి రెండు ట్రాలీ లగేజ్ బ్యాగుల్లో గంజాయి ప్యాకెట్లను ఉంచి, బెంగళూరులోని సతీష్ అనే వ్యక్తికి అందజేయాలని సూచించినట్లు నిందితులు తెలిపారు. దీంతో వారు సుకుమ ప్రాంతం నుంచి గంజాయిని తీసుకుని భద్రాచలం ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకుని, బెంగళూరు వెళ్లేందుకు బస్సు కోసం వేచి ఉండగా పోలీసులు పట్టుకున్నారు. నిందితుల వద్ద నుంచి సుమారు 19 కేజీల గంజాయి, దీని విలువ సుమారు రూ.9,41,500/- , అలాగే రెండు మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. పట్టుబడిన ఇద్దరు నిందితులను భద్రాచలం పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించగా, భద్రాచలం పట్టణ ఇన్‌స్పెక్టర్ యం. నాగరాజు కేసు నమోదు చేసి, నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా భద్రాచలం డీఎస్పీ మాట్లాడుతూ, యువత గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై నిఘా ఉంచి, మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా అవగాహన కల్పించాలని కోరారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయం, నిల్వ, వినియోగానికి పాల్పడే వారితో పాటు అక్రమ రవాణాకు సహకరించే వ్యక్తులపై కూడా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల అక్రమ విక్రయం, రవాణా, నిల్వకు సంబంధించిన సమాచారం తెలిసిన ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.




# ప్రముఖ రైతు నేత సారంపల్లి మల్లారెడ్డి మృతి

**- రైతు ఉద్యమానికి తీరని లోటు -- జీవితాంతం ప్రజా పోరాటాలు.**

**- సీపీఎం సత్తుపల్లి పట్టణ కమిటీ, తెలంగాణ రైతు సంఘం సంతాపం.**

**సత్తుపల్లి ఆగస్టు 24 మీ వార్త అర్ సి:** సత్తుపల్లి ప్రముఖ రైతు నేత, సీపీఎం సీనియర్ నాయకుడు, రాష్ట్ర మాజీ కార్యదర్శివర్గ సభ్యుడు, అఖిల భారత కిసాన్ సభ మాజీ ఉపాధ్యక్షుడు కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి (90) మృతి పట్ల సీపీఎం సత్తుపల్లి పట్టణ కమిటీ, తెలంగాణ రైతు సంఘం తీవ్ర సంతాపం వ్యక్తం చేశాయి. హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున 3 గంటలకు ఆయన మృతి చెందారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి చిత్రపటానికి సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మోరంపూడి పాండురంగారావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సీపీఎం సత్తుపల్లి పట్టణ కార్యదర్శి కొలికపోగు సర్వేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సంతాప సభలో మోరంపూడి పాండురంగారావు, రావుల రాజబాబు, కొలికపోగు సర్వేశ్వరరావు మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ ఉద్యమాన్ని బలోపేతం చేయడంలో సారంపల్లి మల్లారెడ్డి కీలక పాత్ర పోషించారని తెలిపారు. పేదలు, దళితుల భూముల పరిరక్షణ, భూసమస్యలు, సాగునీరు, వ్యవసాయ సంక్షోభం తదితర సమస్యలపై ఆయన జీవితాంతం పోరాడారని పేర్కొన్నారు. సీపీఎం, రైతు సంఘం నిర్మాణంలో గ్రామస్థాయి నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయి వరకు ఆయన విశేష సేవలు అందించారని అన్నారు.రైతాంగ సమస్యలపై అనేక పుస్తకాలు రచించి ప్రజల్లో అవగాహన కల్పించిన మల్లారెడ్డి సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన మృతి వామపక్ష, రైతాంగ ఉద్యమాలకు తీరని లోటని, ఆయన ఆశయాలు, పోరాట స్ఫూర్తిని కొనసాగించడమే ఆయనకు నిజమైన నివాళి అని ఆయన అన్నారు, ఈ కార్యక్రమంలో, సిపిఎం సత్తుపల్లి పట్టణ కమిటీ సభ్యులు మోరంపూడి వెంకట్రావు చావా రమేష్ మోరంపూడి గుదే రాము వెంకటేశ్వరావు, కాపా రమణ చెరుకు శ్రీను, చెరుకు రత్నకుమారి,పుష్పవల్లి భాస్కర్, సైదా రామకృష్ణ, వెంకటేశ్వరరావు, సంతోష్, కుమార్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



# ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం

**- వార్డెన్ రమేష్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు.**

**సత్తుపల్లి ఆగస్టు 24 మీ వార్త అర్ సి:** సత్తుపల్లి పట్టణంలోని ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని వార్డెన్ రమేష్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. శిబిరంలో విద్యార్థుల ఆరోగ్య సమస్యలను వైద్యులు అడిగి తెలుసుకుని అవసరమైన ప్రాథమిక వైద్య పరీక్షలు చేశారు. ఆరోగ్య పరిస్థితిని బట్టి తగిన వైద్య సలహాలు అందించడంతో పాటు అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఆరోగ్య సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన చికిత్స తీసుకోవడం ద్వారా అనారోగ్య తీవ్రతను తగ్గించవచ్చని వైద్యులు సూచించారు. విద్యార్థులకు ఆరోగ్యకరమైన జీవన విధానం, సమతుల్య ఆహారం, వ్యక్తిగత పరిశుభ్రత, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. చిన్నపాటి అనారోగ్య లక్షణాలను కూడా నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్యులను సంప్రదించాలని సూచించారు. అవసరమైన విద్యార్థులను తదుపరి వైద్య పరీక్షలు, చికిత్స కోసం ఆసుపత్రులకు రిఫర్ చేశారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ఇలాంటి వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వార్డెన్ రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా అనారోగ్య సమస్యలను ముందుగానే గుర్తించవచ్చని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తులోనూ మరిన్ని ఆరోగ్య కార్యక్రమాలు నిర్వహించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఉచిత వైద్య శిబిరం నిర్వహిం ఐ ఎం జి -20260824-





ఞూ0699 చడం పట్ల విద్యార్థులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. వైద్యులు, వైద్య సిబ్బంది, నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఎస్.ఐ. ఆర్. రెండో విడత ప్రక్రియలో ప్రతి ఒక్కరు భాగస్వాములు అవ్వాలి

**ఎమ్మెల్యే రామరావ్ పటేల్**

**బాసర :** ఎస్ ఐఆర్ రెండో విడత ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు అవ్వాలని ఎమ్మెల్యే రామరావ్ పటేల్ బిజెపి నాయకులకు కార్యకర్తలకు సూచించారు. ఆదివారం బైంసా పట్టణంలోని ఎస్ ఎస్ జిన్నింగ్ ఇండస్ట్రీలో బిజెపి బిఎల్ఏ 2 కార్యకర్తలచే ఎస్ ఐ ఆర్ పై రెండో విడత అసెంబ్లీ కార్యాశాల నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సర్ ప్రక్రియతో బోగస్ ఓట్లకు ఇక తావుండదని, రెండో విడతలో ఏమైనా అనుమా నాలు ఉంటే అధికారులకు తెలియజే యాలన్నారు. ఒకరికి ఒకచోట మాత్రమే ఓటు హక్కు కల్పించాల న్న ఉద్దేశంతో ఎన్నికల కమిషన్ సర్ ప్రక్రియ చేపట్టడం జరిగిందన్నారు. వలసదారులకు అడ్డుకట్ట వేసేందుకు, విదేశీయు లు చొరబడి ఇక్కడ ఉండకుండా చూడడానికి ఎస్. ఐ.ఆర్ ఎంతో దోహదపడుతుందన్నారు. అనంతరం ఎస్. ఐ ఆర్ స్టేట్ కో కన్వీనర్ సంజర్ల శ్రీనివాస్ జిల్లా అధ్యక్షులు రితీష్ రాథోడ్, సర్ జిల్లా ఇన్చార్ రావుల రామ్ నాథ్, ముధోల్ ఎస్. ఐ.ఆర్ ఇన్చార్జి పైడిపల్లి గంగాధర్, ఎస్ ఐ ఆర్ రెండో విడతలో చేపట్టాల్సిన అంశాలను వివరించారు.. కార్యక్రమం లో మున్సిపల్ చైర్మన్ తుమోల్ల దత్తాత్రి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నారాయ ణరెడ్డి,బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నారెడ్డి రవి పాండే, అసెంబ్లీ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్ తో పాటు మండల బిజెపి అధ్యక్షులు, సర్పంచులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు





# టైగర్ జోన్ రద్దు చేయాలి-ఏకో సెన్సిటివ్ జోన్ ఎత్తివేయాలి

**రిలే నిరాహారదీక్ష చేపట్టిన భూమాచారి**



**జన్నారం :** జన్నారం డివిజన్ లోని కవ్వాల్ టైగర్ జోన్ రద్దు చేయాలని, ఏకో సెన్సిటివ్ జోన్ ఎత్తి వేయాలని డిమాండ్ చేస్తూ సామాజిక పోరాట సమితి మండల అధ్యక్షుడు శ్రీరాముల భూమాచారి మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ రిలే నిరాహారదీక్ష కు మండల వర్తక వ్యాపారులు, పలు పార్టీల నాయకులు ప్రజాప్రతినిధులు, కుల సంఘాలు, పలువురు సర్పంచులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా భూమాచారి మాట్లాడుతూ కవ్వాల్ టైగర్ జోన్ ఆంక్షలు ఎత్తివేయడం కాదు పూర్తిగా కవ్వాల్ టైగర్ జోన్ ను ఎత్తివేయాలని అసెంబ్లీలో తీర్మానం చేయాలని, ఎకో సెన్సిటివ్ జోన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. టైగర్ జోన్ పేరుతో జన్నారం రేంజిలో సస్పెండ్ చేసిన అటవీ శాఖ ఉద్యోగులను విధుల్లో చేర్చుకొని సర్వీసులో ఎలాంటి మరకలు లేకుండా పూర్తి జీతం చెల్లించాలని కోరారు. గుడిహత్నూర్ నుండి జన్నారం మీదుగా కరీంనగర్ వరకు నాలుగు వరుసల జాతీయ రహదారిని వెంటనే ఏర్పాటు చేయాలని, మాజీ సర్పంచ్ జక్కు భూమేష్ పై అటవీశాఖ అధికారులు పెట్టిన కేసులు బేషరతుగా ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. టైగర్ జోన్ ఎత్తివేసే వరకు రిలే నిరాహార దీక్ష కొనసాగుతుందని, 41 రోజుల తర్వాత టైగర్ జోన్ ఎత్తివేయక పోతే ఆమరణ నిరాహారదీక్ష చేపడతారని హెచ్చరించారు. ఈ రిలే నిరాహార దీక్షకు మండలవాసులు, అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు.

# మంచిర్యాలలో కాంగ్రెస్ లొల్లి పేరుతో అసత్య ప్రచారం తగదు

**6వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి మేకల అశ్విని ఏ వర్గంలో చేరలేదు**

**సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్**

**మంచిర్యాల :** మంచిర్యాలలో కాంగ్రెస్‌లో లొల్లి అంటూ ఓ పత్రికలో (ప్రజాజ్యోతి కాదు ) ప్రచురితమైన కథనంలో 6వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి మేకల అశ్విని ఒక రాజకీయ వర్గంలో చేరినట్లు పేర్కొనడం పూర్తిగా అవాస్తవమని, ఆ ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ తెలిపారు. వ్యక్తిగత పోకడలు, స్వప్రయోజనాల కోసం రాజకీయంగా నిబద్ధతతో పనిచేస్తున్న వ్యక్తులపై తప్పుడు ప్రచారం చేయడం సరికాదని అన్నారు. మేకల అశ్విని ఎలాంటి రాజకీయ వర్గ మార్పులకు పాల్పడలేదని, కమ్యూనిస్టు పార్టీ పట్ల నిబద్ధతతో, సిద్ధాంతపరమైన విలువలకు కట్టుబడి పనిచేస్తున్నారని రామడుగు లక్ష్మణ్ స్పష్టం చేశారు. వాస్తవాలను నిర్ధారించుకో కుండా వ్యక్తుల పేర్లను రాజకీయ వర్గాలతో ముడిపెట్టి వార్తలు రాయడం సరికాదన్నారు. "బూర్జువా సంస్కృతిని కమ్యూనిస్టులకు అంటకట్టవద్దు. మేము నిలకడగా, నిబద్ధతతో పనిచేసే వాళ్లం" అని ఆయన అన్నారు. కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు, నాయకులు పదవులు, వ్యక్తిగత ప్రయోజనాల కోసం తమ రాజకీయ విధానాలను మార్చుకునే వారు కాదని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ సిద్ధాంతపరంగా ముందుకు సాగుతారని తెలిపారు. ఎవరైనా కావాలని తప్పుడు సమాచారం ఇచ్చినా, వాస్తవాలను తెలుసుకోకుండా ప్రచురించినా అది "సూర్యుడిపై ఉమ్మివేయడానికి ప్రయత్నించినట్టే" అవుతుందని, ఇలాంటి తప్పుడు ప్రచారాలతో కమ్యూనిస్టుల నిబద్ధతను దెబ్బతీయలేరని రామడుగు లక్ష్మణ్ అన్నారు. పత్రికలో ప్రచురితమైన సదరు కథనంలోని తప్పుడు సమాచారాన్ని వెంటనే సరిదిద్ది, వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# రాయదుర్గంలోని భూములు రికార్డు ధర

**హైదరాబాద్ :** రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం రాయదుర్గంలోని భూములు రికార్డు ధర పలికాయి. తాజాగా నిర్వహించిన ఆన్‌లైన్ వేలంలో ఎకరా భూమి రూ.264 కోట్ల భారీ ధర పలికింది. ఓజొ రియాలిటీ సంస్థ అంత ధర పలికి భూములు దక్కించుకుంది. అధిక ధర పలికి మొత్తం 5.25 ఎకరాలను అదే సంస్థ వేలంలో సొంతం చేసుకుంది. దాదాపు 3 నెలల కిందట జరిగిన వేలంలో ఇదే సర్వే నెంబర్‌లో ఎకరా భూమి ఏకంగా రూ.237 కోట్లు పలికిన విషయం తెలిసిందే. తాజాగా ఈ రికార్డు బద్దలుకొట్టి హైదరాబాద్ రియల్ ఎస్టేట్ కొత్త పుంతలు తొక్కుతోంది. భూముల వేలానికి సుప్రీంకోర్టు లైన్ క్లియర్ చేయడంతో సర్వే నంబర్ 83/1లోని 5.25 ఎకరాలను ఆన్‌లైన్లో వేలం వేశారు.రంగారెడ్డి జిల్లాలోని రాయదుర్గం పాన్‌మక్తాలో 11 ఎకరాల టీజీఐఐసీ భూముల వేలం ప్రక్రియను నిలిపివేసుందుకు దేశ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు శుక్రవారం నాడు నిరాకరించింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం ఇందులో జోక్యం చేసుకోబోమని స్పష్టం చేసింది. గతంలో స్టే ఇచ్చిన కంచ గచ్చిబౌలి భూములకు, వేలం వేసే ప్రాంతానికి 5 కి.మీ దూరం ఉందని, రెండింటికీ సంబంధం లేదని తెలంగాణ ప్రభుత్వం తరఫున అభిషేక్ మను సింఘ్వీ స్పష్టం చేయడంతో జువ్వాడి ప్రణయ్ సింహారావు దాఖలు చేసిన పిటిషన్‌ను సీజేఐ ధర్మాసనం తిరస్కరించింది. ఇప్పటికే ఈ వేలంపై మధ్యంతర స్టే ఇచ్చేందుకు తెలంగాణ హైకోర్టు సింగిల్ జడ్జీలు కూడా ఇదివరకే నిరాకరించారు. ల్యాండ్ రిఫార్మ్స్ ట్రిబ్యునల్ (ఎల్‌ఆర్‌టీ)ను ఆశ్రయించినట్లు లేదా విచారణ పెండింగ్‌లో ఉన్నట్లు ఆధారాలు లేవని జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ పేర్కొనగా, ఎస్. రవీంద్రనాథ్ దాఖలు చేసిన మరొక పిటిషన్‌పై జస్టిస్ నగేష్ భీమపాక ప్రభుత్వం, హెచ్ఎండీఏలను కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. ఈ కేసు తదుపరి విచారణను సెప్టెంబరు 19కి వాయిదా వేయడం తెలిసిందే.

## బిజినెస్

### రూ.2 లక్షల జీతం.. అయినా కష్టాలే!



సాధారణంగా నెలకు రూ.1 లక్ష నుంచి రూ.2 లక్షల జీతం అంటే చాలామందికి మంచి ఆదాయమే. ఇలాంటి జీతం వస్తే హాయిగా జీవించొచ్చని అనుకుంటారు. కానీ.. పెద్ద నగరాల్లో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంటుందని ఓ మహిళ చెబుతోంది. నెలకు రూ.1-2 లక్షలు సంపాదిస్తున్నా.. ఖర్చులు పోగా చేతిలో పెద్దగా డబ్బు మిగలడం లేదని పేర్కొంది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

**ఏమిటీ 'శాలరీ ట్రాప్'**

ఇన్‌స్టాగ్రామ్‌లో నిధి కుష్వాహా అనే మహిళ ఈ విషయంపై తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. టైర్-1 నగరాల్లో నెలకు రూ.1-2 లక్షలు సంపాదించే వాళ్లు కూడా ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని వివరించారు. ఆమె చెప్పిన లాజిక్ కూడా చాలామందికి కనెక్ట్ అవుతోంది. ఈ జీతం తక్కువ ఆదాయంతో జీవించే స్థాయి నుంచి బయటపడటానికి సరిపోతుంది. కానీ.. ఖరీదైన జీవనశైలిని ఎలాంటి ఆలోచన లేకుండా కొనసాగించడానికి మాత్రం సరిపోదు. అంటే.. జీతం బాగానే ఉంటుంది, కానీ నెలాఖరుకు బ్యాంక్ బ్యాలెన్స్ చూస్తే మాత్రం నిరాశే మిగులుతుంది.

**పెద్ద నగరాల్లో ఖర్చులు**

ఇక్కడ ప్రధాన సమస్య జీవన వ్యయం. టైర్-1 నగరాల్లో ఇంటి అద్దె ఒక్కటే జీతంలో పెద్ద భాగాన్ని తీసుకుపోతుంది. దానికి తోడు కరెంట్, ఇంటి ఖర్చులు, కారు లేదా బైక్ ఈఎంఐ, పెట్రోల్, పిల్లల స్కూల్ ఫీజులు, వైద్యం, బయట తినడం, షాపింగ్ ఇలా ఒక్కో ఖర్చు కలుస్తూ పోతుంది. ఉదాహరణకు నెలకు రూ.1.5 లక్షలు జీతం వస్తే.. అందులో రూ.30-40 వేలు ఇంటి అద్దెకే వెళ్లొచ్చు. పిల్లలున్న కుటుంబాల్లో స్కూల్ ఫీజులు, వైద్య ఖర్చులు అదనంగా ఉంటాయి. కారు ఈఎంఐ లేదా హోమ్ లోన్ ఉంటే మరో పెద్ద మొత్తం అక్కడే పోతుంది. చివరికి పొదుపు చేయడానికి అనుకున్న డబ్బు చాలా తక్కువగా మిగలొచ్చు.

**జీతం పెరిగితే ఖర్చులు కూడా**

ఇక్కడ మరో ఆసక్తికరమైన విషయం లైఫ్‌స్టైల్ ఇన్‌ఫ్లేషన్. జీతం పెరిగినప్పుడు మన అవసరాలు మాత్రమే కాదు.. మన కోరికలు కూడా పెరుగుతాయి. మంచి జీతం రావడంతో ఖరీదైన ఇల్లు, కొత్త కారు, ఎక్కువ ట్రావెల్స్, రెస్టారెంట్లు, బ్రాండెడ్ వస్తువులు ఇలా ఖర్చులు పెరగొచ్చు. మొదట్లో ఇవన్నీ చిన్న ఖర్చుల్లానే అనిపిస్తాయి. కానీ నెలాఖరుకు చూస్తే మొత్తం పెద్దదైపోతుంది. అందుకే కొంతమందికి జీతం రూ.80 వేల నుంచి రూ.1.5 లక్షలకు పెరిగినా.. పొదుపు మాత్రం పెద్దగా పెరగదు.

**ఇతరులతో పోల్చుకోవడం మరో సమస్య**

సోషల్ మీడియా వల్ల ఈ సమస్య మరింత పెరుగుతోందని కొందరు అభిప్రాయపడుతున్నారు. మన చుట్టూ ఉన్నవాళ్లు కొత్త కారు కొంటున్నారు, విదేశాలకు వెళ్తున్నారు, ఖరీదైన రెస్టారెంట్లకు వెళ్తున్నారు అని చూసి మనం కూడా అదే స్థాయిలో జీవించాలనుకుంటాం. కానీ వాళ్ల ఆదాయం ఎంత?, వాళ్ల అప్పులు ఎంత?, వాళ్లు ఎంత పొదుపు చేస్తున్నారు?, అనేది మనకు తెలియదు. అయినా వాళ్ల జీవనశైలిని చూసి మన ఆర్థిక పరిస్థితికి సరిపోని ఖర్చులు చేస్తే సమస్యలు మొదలవుతాయి.

**నెటిజన్ల స్పందన**

నిధి కుష్వాహా వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో భిన్నమైన స్పందనలు వచ్చాయి. కొందరు ఆమె చెప్పింది నిజమేనని అన్నారు. తమ స్నేహితులు కూడా ఇలాంటి ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని కొందరు చెప్పారు. అయితే.. మరికొందరు మాత్రం సమస్య జీతంలో కంటే మన ఖర్చు చేసే విధానంలో ఎక్కువగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. మనకు

# వైద్య వ్యాపారం భళా..

**విస్తరణ బాటలో ప్రముఖ దవాఖానలు.. ఆంత్రప్రెన్యూర్లుగా డాక్టర్ల దూకుడు**

**ప్రైవేట్ ఈక్విటీలు, పబ్లిక్ మార్కెట్ల నుంచి నిధుల సమీకరణ**

**రుణ భారం తగ్గించుకుంటూనే ఆధునికీకరణ దిశగా అడుగులు**

**ఆస్పత్రుల కొనుగోళ్లు, విలీనాలతో నెట్‌వర్క్ పెంచుకుంటున్న బడా గ్రూపులు**



**న్యూఢిల్లీ :** కూడు.. గూడు.. గుడ్డ.. ఆ తర్వాత ఈ దేశంలోని కోట్లాది ప్రజల కల ఆరోగ్య సంరక్షణే. ఇదే.. ఇప్పుడు భారతీయ వైద్య రంగాన్ని వేగంగా వృద్ధిపథంలో నడిపిస్తున్నది. ఇక ఆపత్కాలంలో వైద్యం చేయడమే కాదు.. అవసరమైతే ఆంత్రప్రెన్యూర్లుగానూ మారుతామని డాక్టర్లు నిరూపిస్తున్నారు. దీంతో హెల్త్‌కేర్ బిజినెస్ దూసుకుపోతున్నది. అందరికీ ఆరోగ్య బీమా అందుబాటులోకి రావడం కూడా.. ప్రైవేట్ ఆస్పత్రుల విస్తరణకు దోహదం చేస్తున్నది. దేశంలో 60 కోట్లకుపైగా జనాభాకు ఆరోగ్య బీమా ఉన్నట్టు అంచనా. హెల్త్ చెకప్ ప్యాకేజీలను బుక్ చేయడం ఇదీ సంగతి..

మణిపాల్, అపోలో దగ్గర్నుంచి మ్యాక్స్ హెల్త్‌కేర్, ఫోర్టిస్ హెల్త్‌కేర్, మేదాంత, పరాస్ హెల్త్, యశోదా హాస్పిటల్స్ వరకు దేశంలోని అన్ని ప్రధాన దవాఖానల గ్రూపులు.. పడకలను పెంచుకుంటూ, కొత్త మార్కెట్లలోకి ప్రవేశిస్తూపోతున్నాయి. ఈ క్రమంలోనే దేశ, విదేశీ పెట్టుబడిదారులను ఆకర్షించడమేగాక, స్టాక్ మార్కెట్ల నుంచీ ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ల (ఐపీవో) ద్వారా పెద్ద ఎత్తున నిధులను సమీకరిస్తున్నాయి. పడకల సామర్థ్యం ప్రకారం దేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ హాస్పిటల్ నెట్‌వర్క్ అయిన మణిపాల్ హెల్త్ ఎంటర్‌ప్రైజెస్.. జూలైలో రూ.9,275 కోట్ల ఐపీవోను తెచ్చింది. దేశ, విదేశాల్లో దవాఖానల కొనుగోలుకు చేసిన అప్పులను తీర్చేందుకు ఈ నిధులను వినియోగిస్తామని మణిపాల్ చెప్తున్నది. అలాగే అపోలో హాస్పిటల్స్ వచ్చే ఐదేండ్లలో దాదాపు 4,400 బెడ్లను పెంచుకోవాలని చూస్తున్నది. మరోవైపు ఢిల్లీ, ముంబై, గువాహటి, వారణాసి నగరాల్లో విస్తరించి, 2,950 బెడ్లను పెంచుకోవాలని మేదాంత యోచిస్తున్నది. ఇదే క్రమంలో వచ్చే 3-4 ఏండ్లలో గురుగ్రామ్, లక్నో, ఢిల్లీ, పంజాబ్, భువనేశ్వర్ ప్రాజెక్టుల ద్వారా మ్యాక్స్ హెల్త్‌కేర్ తమ పడకల సామర్థ్యాన్ని 10వేలకుపైగా పెంచుకోవాలని ప్రయత్నిస్తున్నది. ఇక గ్రేటర్ నోయిడాలోని యశోదా మెడిసిటీలో యశోదా గ్రూప్ రూ.2,400 కోట్లను పెట్టుబడిగా పెడుతున్నది. ఫోర్టిస్, పారస్.. ఇలా అనేక ప్రముఖ గ్రూపులు దేశవ్యాప్తంగా విస్తరించాలని ప్రణాళికల్ని రచిస్తున్నాయి. పారిశ్రామిక పరికరాలను అద్దెకు తీసుకోవడం

**ఆంత్రప్రెన్యూర్లుగా..**

భారతీయ హాస్పిటల్ బూమ్ కేవలం పెట్టుబడుల ద్వారానే రాలేదు. దీని వెనుక దేశంలోని అతిపెద్ద హెల్త్‌కేర్ ఇనిస్టిట్యూషన్ల పెద్దలున్నారు. డాక్టర్లుగా తమ ప్రయాణాన్ని మొదలుపెట్టి.. ఇప్పుడు విజయవంతమైన దవాఖానల నిర్వాహకులుగా పేరుగాంచారు. డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి (అపోలో హాస్పిటల్స్), డాక్టర్ నరేశ్ ట్రెహాన్ (మేదాంత), డాక్టర్ దేవీ శెట్టి (నారాయణ హెల్త్).. ఇలా ఎందరో ఉన్నారు. విదేశీ పెట్టుబడులను ఆకర్షిస్తూ దూసుకెళ్తున్నారు. ఈ వరుసలో హైదరాబాద్ ఆధారిత, రెండు తెలుగు రాష్ర్టాలకు చెందినవారు ఒక అడుగు ముందే ఉన్నారంటే అతిశయోక్తి కాదు. దేశంలోని ఫార్మా కంపెనీల్లో ఎక్కువగా ఇక్కడే ఉండటం కూడా కలిసొస్తున్న అంశంగా ఇండస్ట్రీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. హాస్పిటల్స్ విస్తరణతో వైద్యులు, నర్సింగ్, ల్యాబ్ టెక్నీషియన్లు ఇతరత్రా మెడికల్ సిబ్బందికి ఉద్యోగావకాశాలూ పెరుగుతున్నాయని అంటున్నాయి.

2021-22 నుంచి ఇప్పటిదాకా ప్రైవేట్ ఈక్విటీలు, పబ్లిక్ మార్కెట్ల ద్వారా వివిధ ఆస్పత్రులు రూ.55,000-60,000 కోట్ల నిధులను సమీకరించినట్టు కేర్ రేటింగ్స్ అంచనా.

2030నాటికి అదనంగా మరో 38,000కుపైగా పడకల సామర్థ్యాన్ని పెంచుకోవాలని చూస్తున్న ప్రధాన హాస్పిటల్ గ్రూపులు. ఇందుకు రూ.40,000 కోట్ల పెట్టుబడులు పెట్టే అవకాశం.

యశోదా హాస్పిటల్స్ ఐపీవోకు సెబీ నుంచి గ్రీన్‌సిగ్నల్. ఫ్రెష్ ఇష్యూ, ఆఫర్ ఫర్ సేల్ ద్వారా రూ.3,000-4,000 కోట్ల నిధుల సమీకరణే లక్ష్యంగా రావచ్చన్న అంచనాలు.

తెలుగు రాష్ర్టాలకు చెందిన అపోలో, యశోదా, కిమ్స్, కేర్, కామినేని, ఏఐజీ, రెయిన్‌బో హాస్పిటల్స్ గ్రూపులు.. దేశవ్యాప్తంగా, తొలుత దక్షిణాది రాష్ర్టాల్లో విస్తరణ దిశగా అడుగులు.

గడిచిన ఐదేండ్లలో తమ నెట్‌వర్క్‌లోకి 31 చిన్న ఆస్పత్రులను చేర్చుకున్న మణిపాల్ హెల్త్. అపోలో, కిమ్స్ తదితర సంస్థలూ ఇతర ఆస్పత్రులను హస్తగతం చేసుకోవడం, భాగస్వామ్యంగా చేర్చుకోవడం చేస్తున్నాయి. హెల్త్ చెకప్ ప్యాకేజీలను బుక్ చేయడం

టై-అప్‌ల ద్వారా కొత్త ప్రాంతాల్లోకి, నూతన వైద్య సేవల్లోకి వెళ్తున్న బడా కార్పొరేట్ ఆస్పత్రులు. సంయుక్తంగా దవాఖానలను నిర్వహిస్తూ లాభాల్లోకి.

2010లో రూ.12,546గా ఉన్న ప్రైవేట్ దవాఖానల సగటు ఇన్-పేషెంట్ ఖర్చు.. 2023లో రూ.42,600కు చేరిందని చెప్తున్న ఎన్ఎస్ఎస్‌వో గణాంకాలు.

దేశంలోని మెట్రో నగరాలు, ప్రధాన నగరాలకే పరిమితం కాకుండా.. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో విస్తరణపట్ల కూడా ఆసక్తి చూపుతున్న బడా హాస్పిటల్ గ్రూపులు.

# చరిత్ర సృష్టించిన టీమిండియా బ్యాటర్..

# ప్రపంచంలోనే రెండో ప్లేయర్‌గా

చేతేశ్వర్ పుజారా రిటైర్మెంట్ తర్వాత టెస్టుల్లో భారత జట్టుకు మూడో స్థానం పెద్ద సమస్యగా మారిన సంగతి తెలిసిందే. సాయిసుదర్శన్, కరుణ్ నాయర్ వంటి ఆటగాళ్లను ప్రయోగించినప్పటికి పుజారా స్థానాన్ని భర్తీ చేయలేకపోయాడు. అయితే ఎట్టకేలకు పుజారా వారుసుడు దొరికాడు. మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి అద్భుతాలు చేస్తున్నాడు. అతడే కర్ణాటక స్టార్ బ్యాటర్ దేవ్‌దత్ పడిక్కల్. దాదాపు మూడేళ్ల తర్వాత భారత టెస్టు జట్టులోకి ఎంట్రీ ఇచ్చిన పడిక్కల్ శతకాల మోత మోగిస్తున్నాడు. గాలే వేదికగా జరిగిన తొలి టెస్టులో సెంచరీతో సత్తాచాటిన పడిక్కల్.. ఇప్పుడు కొలంబోలో కూడా అద్భుత శతకంతో కదం తొక్కాడు. 193 బంతుల్లో 12 ఫోర్లతో 117 పరుగులు చేశాడు. ఈ క్రమంలో పడిక్కల్ పలు అరుదైన రికార్డులను తన పేరిట లిఖించుకున్నాడు. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ చరిత్రలో ఒకే సిరీస్‌లో మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి ఒకటి కంటే ఎక్కువ సెంచరీలు చేసిన రెండో బ్యాటర్‌గా పడిక్కల్ నిలిచాడు. ఇంతకుమందు ఇంగ్లండ్ కెప్టెన్ జో రూట్ మాత్రమే ఈ ఘనత సాధించాడు. ఇప్పుడు రూట్ సరసన పడిక్కల్ చేరాడు. అంతేకాకుండా విదేశీ గడ్డపై భారత జట్టు తరపున మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి వరుసగా సెంచరీలు చేయడం 2019 తర్వాత ఇదే తొలిసారి. చివరగా 2018-19 బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో పుజారా వరుసగా




రెండు సెంచరీలు చేశాడు. మళ్లీ ఇప్పుడు ఏడేళ్ల తర్వాత ఈ ఫీట్‌ను దేవ్‌దత్ నమోదు చేశాడు.

## ఈస్ట్ బెంగాల్‌దే డ్యూరండ్ కప్..

## 22 ఏండ్ల తర్వాత ట్రోఫీ సొంతం

**కోల్‌కతా :** ప్రతిష్టాత్మక డ్యూరండ్ కప్‌లో ఈస్ట్ బెంగాల్ రెండు దశాబ్దాల తర్వాత ట్రోఫీ గెలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్‌లో ఆ జట్టు.. 4-1తో తమ చిరకాల ప్రత్యర్థి మోహన్ బగాన్ సూపర్ జెయింట్స్‌ను ఓడించి 22 ఏండ్ల తర్వాత మళ్లీ డ్యూరండ్ కప్‌ను కైవసం చేసుకుంది. ఫైనల్‌లో ఆ జట్టు తరఫున ఎడ్మండ్ లాల్రిండికా (12వ, 22వ, 44వ నిమిషాల్లో) హ్యాట్రిక్ గోల్స్ కొట్టగా బిపిన్ (10వ) ఒక గోల్ చేశాడు. 2004లో బెంగాల్.. 2-1తో మోహన్ బగాన్‌ను ఓడించి టైటిల్ గెలిచిన అనంతరం మళ్లీ ఆ జట్టు ఈ ట్రోఫీని నెగ్గడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ ట్రోఫీతో డ్యూరండ్ కప్‌ను అత్యధిక సార్లు గెలుచుకున్న జట్టుగా ఈస్ట్‌బెంగాల్.. మోహన్ బగాన్(17)తో సమానంగా నిలిచింది.




## స్పోర్ట్స్

### 9వ స్థానంలో బ్యాటింగ్.. కట్ చేస్తే!

### 5ఫోర్లు, 5 సిక్సర్లతో విధ్వంసం



బెంగళూరు వేదికగా వెస్ట్ జోన్‌తో జరుగుతున్న దులీప్ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో నార్త్ జోన్ ఫాస్ట్ బౌలర్, చెన్నై సూపర్ కింగ్స్ స్టార్ అన్షుల్ కాంబోజ్ బ్యాట్‌తో విరుచుకుపడ్డాడు. తొలి ఇన్నింగ్స్‌లో నార్త్‌జోన్ 165 పరుగులే 7 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ సమయంలో క్రీజులోకి వచ్చిన కాంబోజ్ ప్రత్యర్ధి బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. వన్డే ఫార్మాట్‌ను తలపిస్తూ కేవలం 52 బంతుల్లోనే 5 ఫోర్లు, 5 సిక్సర్లతో 60 పరుగులు చేశాడు. తొమ్మిది బ్యాటింగ్‌కు వచ్చిన కాంబోజ్ ఈ తరహా విధ్వంసం సృష్టిస్తాడని వెస్ట్ జోన్ బౌలర్లు అస్సలు ఊహించి ఉండరు. తుషార్ దేశ్‌పాండే, తనుష్ కొటియాన్ వంటి స్టార్ బౌలర్లను సైతం అన్షుల్ వదల్లేదు. ఫలితంగా నార్త్ జోన్ తమ మొదటి ఇన్నింగ్స్‌లో 251 పరుగులకు ఆలౌటైంది. నార్త్‌జోన్ బ్యాటర్లలో కాంబోజ్‌తో పాటు అయూశ్ బదోని(51),ఆయుష్ దోసేజా(42) రాణించారు. మిగితా బ్యాటర్లంతా దారుణంగా విఫలమయ్యారు. వెస్ట్ జోన్ బౌలర్లలో తనీష్ కోటియన్, దేశ్‌పాండే తలా నాలుగు వికెట్లు సాధించారు. ఇక బ్యాటింగ్‌లో సత్తాచాటిన అన్షుల్.. బౌలింగ్‌లో ఎలా రాణిస్తాడో చూడాలి. మొదటి రోజు ఆటలో అతడికి బౌలింగ్ చేసే అవకాశం రాలేదు.